# నరక సౌఖ్యం

ఎన్. కె. రామారావు

జీవించినంత కాలమూ యథాశక్తి పాపాలు చేయాలని నిర్ణయించుకుని తన నిర్ణయానికి కట్టుబడి నీరసం – నిస్త్రాణ ఆవహించింతర్వాత అకాలధర్మం చెంది నరక లోకానికి చేరాడు రాబర్ట్ అనే అమెరికన్ పౌరుడు. తీరా అక్కడికి చేరింతర్వాత అతనికి వివిధ దేశాలకు చెందిన నరకాలు తమ తమ దేశపు బోర్డులతో దర్శనమిచ్చాయి. ఫ్రాన్సు నరకం, అమెరికా నరకం, ఇంగ్లాండు నరకం, మలేషియా నరకం, ఇండియా నరకం. రాబర్టు ఈ బోర్డులన్నీ చూసి ఉక్కిరిబిక్కిరయ్యాడు. చనిపోయినా స్వదేశీ ప్రేమను చంపుకోలేక ముందుగా అమెరికా నరకం దగ్గరకెళ్ళాడు.




అక్కడ అతనికి ఓ డెబ్బై అయిదు ఏళ్ళ పెద్ద మనిషి కనిపించాడు. ఎందుకైనా మంచిది శిక్షల వివరం తెలుసుకుందామని ఆ పెద్ద మనిషిని అతనేం పాపం చేశాడో అడిగాడు. దానికాయన తనో బిలియనీరుననీ, ఒక వయసుకత్తె మీద మోజుపడి వయసు విషయంలో అబద్ధమాడి ఆవిడ్ని పెళ్ళాడాననీ అసలు సంగతి తెలుసుకొని ఆవిడ తనను నిద్రలోనే తుదముట్టించిందని తెలిపి కన్నీళ్ళు పెట్టుకున్నాడు. పెద్దాయన కన్నీళ్ళు తుడిచి ఓదార్చి "వయస్సు ఒక యాభై అని ఆవిడకు చెప్పావా" అని వాకబు చేశాడు.

దానికి పెద్ద మనిషి ...లేదు కేవలం తొంభై ఏళ్ళని అబద్ధమాడానని ఆ అబద్ధమే కొంప ముంచిందని మళ్లీ ఏడ్వడానికి సన్నద్ధమయ్యాడు. అతడిని వూరడించి అమెరికన్ నరకంలో విధించే శిక్షల వివరాలు మూడో చెవి వాడికి వినపడకుండా తనకు చెప్పమని ప్రాథేయపడ్డాడు. ముసలాయన రాబర్టు మీద సానుభూతి కురిపిస్తూ "శిక్షలంటే మామూలు శిక్షలు కావు. ముందేమో రెండు గంటలు కరెంటు కుర్చీ మీద కూచోబెడతారు. వొంట్లోంచి విద్యుత్తరంగాలు ప్రవహిస్తుంటే మనం మొట్టమొదటగా ఎలక్ట్రిసిటి కనిపెట్టినవాడిని తిడతామన్నమాట. వాడి పేరు మనకు తెలియకపోయినా, తర్వాత అదిగో – పరుపు బదులుగా మేకులు దిగేసిన మంచం వుందే – దాని మీద నగ్నంగా పడుకోబెడతారు. మేకులు వొంట్లోకి దిగింతర్వాత అటూ ఇటూ కదలలేని ఆ స్థితి వుందే – అబ్బో... ఆ బాధ మాటల్లో చెప్పలేను. పగవాడిక్కూడా వద్దు ఆ బాధ. ఆ తర్వాత మంచం మీంచి తీసి నిలబెడతారు. అప్పుడు అమెరికన్ భూతం వచ్చి కొరడాతో మన రక్తసిక్తమయిన శరీరం మీద ఓ గంటపాటు దెబ్బలు ఎడాపెడా కొడుతుంది. దీని సిగతరగ. ఈ నొప్పులన్నీ రాత్రి

**ముందేమో రెండు గంటలు కరెంటు కుర్చీ మీద కూచోబెడతారు. వొంట్లోంచి విద్యుత్తరంగాలు ప్రవహిస్తుంటే మనం మొట్టమొదటగా ఎలక్ట్రిసిటి కనిపెట్టినవాడిని తిడతామన్నమాట. వాడి పేరు మనకు తెలియకపోయినా.**

ఎనిమిదింటికల్లా మందు వేసినట్లుగా మాయమవుతాయి. తెల్లారి మళ్ళీ ఇదే కార్యక్రమం."

రాబర్టు గుండె లయ తప్పి కొట్టుకోవటం ప్రారంభించింది. వయసు విషయంలో అబద్ధమాడిన వాడికే ఇంత శిక్ష అయితే తనకెంత శిక్షోనని ఆందోళన చెంది ముసలాయనతో పైకి గంభీరంగా ఈ శిక్ష ఒక లెక్క కాదన్నట్లుగా పోజిచ్చి "ఏ పాపానికయినా ఇదే శిక్షా లేక పాపాలను బట్టి మారుతుంటాయా" అని అడిగాడు. నేరం ఏదయినా శిక్ష మాత్రం ఇదేనని పెద్దాయన భరోసా ఇచ్చాడు. తోటి వాళ్ళను ఒక పట్టాన నమ్మని రాబర్టు శిక్షల గురించి నాలుగయిదు దేశాల నరకాల్లో వాకబు చేసి వస్తానని కాలు ఝాడించాడు. ఫ్రాన్సు, ఇంగ్లాండు, మలేషియా నరకాలవాళ్ళు షరా మామూలు. కరెంటు కుర్చీ మేకుల మంచం, భూతం కొరడా– ఈ శిక్షల్లో వీసం మాత్రం తగ్గేది లేదని స్పష్టం చేశారు. రాబర్టు గుండెలు లారీ గేర్లల్లా కీచు కీచుమని శబ్దం మొదలెట్టాయి. ఆ చప్పుళ్ళు భయం తాలూకువని అతని గ్రహించుకున్నాడు. ఎరక్కపోయి చచ్చాన్రానని చింతించాడు. ఇంతలో అతడి మెదళ్ళో ఓ లైటు వెలిగింది. ఇండియన్ నరకానికి వెళ్ళాలనుకున్నాడు. ఎంతైనా భారతీయులు సరళ స్వభావులు. మృదుభాషులు. పాపభీతి, దైవచింతనా మెండుగా కలవాళ్ళు. వేల సంవత్సరాల పూర్వమే వేద వేదాంగాలను నమిలి మింగి అసాధారణ జ్ఞానం సంపాదించుకున్నవాళ్ళు. ఒక చెంప మీద కొడితే రెండవ చెంప చూపించేవాళ్ళు. వీళ్ళ నరకంలో శిక్షలు ఇంత క్రూరాత్మకంగా ఉండకపోవచ్చు. ఇట్లా ఆలోచించి రాబర్ట్ భారతీయ నరకం దగ్గరకు వెళ్ళాడు. అక్కడ ఆ రోజు శిక్షలను భవించి, తీరుబడిగా నిల్చున్న శాస్త్రిగారు కనిపించారు. ఆయన గత జన్మలో పౌరోహిత్యం నెరపినవారు. బోడిగుండు మీద తగు పరిమాణంలో పిలకా, మొఖాన విభూతి పిండికట్లు, జీన్‌ప్యాంటు


దీపావళి శుభాకాంక్షలు

మా ఖాతాదారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు మరియు ఆఫీసు సిబ్బందికి హృదయపూర్వక దీపావళి శుభాకాంక్షలు.

K P
B R

Scince 1969

M/S KOTHA PENTIAH & BODLA RAMACHANDRAIAH

BANARAS SILK PALACE GADWAL SHOP

A/c Showroom



పండుగలకు, వివాహాది శుభకార్యాలకు మరియు ఇతర శుభకార్యాలకు సంభంధించిన కంచి, ధర్మవరం, బెనారస్, గద్వాల్, పోచంపల్లి, కొత్తకోట, బెంగుళూరు మరియు ఫ్యాన్సీచీరల షోరూం

3-3-592 (1289-90), General Bazar, Secunderabad - 03. AP. Ph: 27812965(O), 27908988(R).

> ''ఒరేయి నీలికళ్ల వెధవా. ఇక్కడ కుంభీ పాతం. రౌరవం. పున్నామం... ఇలా చాలా రకాలైన నరకాలున్నాయి. రక్త కాసారాల్లో ముంచి జుట్టుపట్టి పైకి లెగ్గొట్టి ఆ చెంపా ఈ చెంపా వాయించి మళ్ళీ ముంచడం... తాచుపాముల్తో కరిపించి నువ్వు అరిచి గీ పెట్టినా పాము మంత్రం వేయించక పోవటం... గుర్తెట్టుకో''

టీషర్టుల్లో వాక్‌మన్ మీద పాప్‌మ్యూజికు వింటూ కన్పించారు. ఆయన వేషానికి రాబర్టు ముందు నివ్వెరపోయినా వినయం నటిస్తూ నమస్కారం చేశాడు. ఆకస్మాత్తుగా అతనికి తెలుగు మాట్లాడటం వచ్చేసింది. చనిపోతే అన్ని భాషలు తమంతట తామే చనిపోయినవాడిని అనుగ్రహిస్తాయన్న సత్యం అతను చనిపోయిన తర్వాత మొదటి సారిగా తెలుసుకున్నాడు. శాస్త్రిగారి వేషధారణ గురించి మొదటగా తన ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశాడు. శాస్త్రి గారికి మండుకొచ్చింది. ''పోరా పుండాకోరు వెధవా. మీ ప్రపంచీకరణ ప్రభావంతో మేమంతా మట్టికొట్టుకు పోయాం. వేషమేమిటి. భాషేమిటి. వృత్తులేమిటి, విద్యేమిటి అన్నీ మారి చచ్చినయ్యిరా నిన్ను తగలెయ్య.''

రాబర్టు నొచ్చుకోదల్చుకోలేదు. సూటిగా శిక్షల గురించి అడిగితే చెప్పకపోగా మీదపడి కొట్టి కరిచేలాగున్నాడు. మాటల్తో బోల్తా కొట్టించి కూపీ లాగాలి.

''మీకు సెల్ ఫోనుందా శాస్త్రిగారూ'' అంటూ సంభాషణకు ఉపక్రమించాడు.

''ఉందిరా రాగి జుట్టు వెధవా. కనెక్టింగ్ ఆల్ ప్లానెట్స్ ఇన్‌క్లూడింగ్ ఎర్త్. నేను తల్చుకుంటే వివిధ దేశాల ప్రధానులతోనూ, రాష్ట్రపతులతోనూ మాట్లాడగలను. నాకేం భయంలేదు. వాళ్లిక్కడికి రారు. నేను అక్కడికి పోను. నన్నేమీ చేయలేరు. ఎలా వుందిరా మన తెలివి-భడవ కానా''

రాబర్టుకు తిట్లు తినటం తప్ప వేరే మార్గం లేదు. ఎదురు మాట్లాడితే శాస్త్రిగారు శిక్షల గురించి ఆవగింజంత ఆచూకీ కూడా ఇవ్వడు. ''ఒరే అమెరికన బ్బీ మనిషి బ్రతికుండటానికి భయపడాల్సిన రోజులు కానీ చావటానికేం భయంరా? ఎంచక్కా కళ్ళు మూసుకొని చావచ్చు. ఏమంటావ్?''అతని అభిప్రాయం అడిగాడు.

''చిత్తం చిత్తం మీ నరకంలో శిక్షల గురించి వివరాలిస్తారా'' దోసిలి ఒగ్గి మరీ అడిగాడు రాబర్టు.

శాస్త్రిగారు శాంతించారు. ''ఒరేయి నీలికళ్ల వెధవా. ఇక్కడ కుంభీపాతం. రౌరవం. పున్నామం... ఇలా చాలా రకాలైన నరకాలున్నాయి. రక్త కాసారాల్లో ముంచి జుట్టుపట్టి పైకి లెగ్గొట్టి ఆ చెంపా ఈ చెంపా వాయించి మళ్ళీ ముంచడం... మసిలే నూనెలో నీ వొంటి రంగు మారకుండా నిన్ను ఫ్రై చేయడం... తాచుపాముల్తో కరిపించి నువ్వు అరిచి గీ పెట్టినా పాము మంత్రం వేయించక పోవటం... గుర్తెట్టుకో'' అంటూ శాస్త్రి గారు అలుపు తీసుకోవటానికి ఆగారు.

''వామ్మో.. వాయ్యో'' రాబర్ట్ ఆర్తనాదాలు చేశాడు.

''కానీ అబ్బీ! ఇవ్వాళ్ళ ఇవ్వేమీ లేవురా! ఇక్కడా ప్రపంచీకరణ ధోరణి మా సాంప్రదాయపు శిక్షలన్నింటిని అటకెక్కించి మీ అమెరికన్ నరకంలో ఏ శిక్షలైతే అమలు చేస్తున్నారో అవే ఇక్కడ చేస్తున్నారు. కరెంటు కుర్చీ- మేకుల పడక- భూతం కొరడా. మా భారతీయ భూతం ఆఖరులో వచ్చి పిచ్చకొట్టుడు కొడుతుంది.

రాబర్టుకు తమ దేశం మీద కొంచెం కోపం వచ్చింది. మరీ తన పద్ధతులు అందరి మీద రుద్దటం వల్ల తన లాంటి వాళ్లకు వెసులుబాటు లేకుండా పోయింది. అలాంటి భావం తనకు వచ్చినందుకు వెంటనే చెంపలు వేసుకొని పశ్చాత్తాపం ప్రకటించాడు.

''ఒరే అబ్బీ! మా దేశ నరకపు పౌరసత్వం కావాలో వద్దో త్వరగా తేల్చి చెప్పు. నువు వద్దనుకున్నా ఫర్వాలేదు. రైలూ, రోడ్డు ప్రమాదాల్లో తనువులు చాలించిన మా వాళ్ళే తండోపతండాలుగా వస్తున్నారు. పైగా విదేశీయుల వత్తిడి బాగా పెరి

ఆయుర్వేద రంగానికి తలమానికం డా॥ రావూస్ హెర్బల్ ఫార్మా

కేశాలకు ఇన్సూరెన్సా ! మరింకేం కావాలి ?

ఆయుర్వేద విశిష్ట వన మూలికలతో శాస్త్రీయ పద్ధతిలో కొబ్బరినూనెతో మేళవించి, అందరికీ సరిపడే విధముగా రూపొందించబడిన ఆయుర్వేద తలనూనె. ఏ రకమైన దుష్ఫలితాలు కలిగించదు.

డా॥ రావూస్
కేశోవిన్
ఆయుర్వేదిక్ హెర్బల్ హెయిర్ టానిక్

★ చుండ్రు, జుట్టు రాలుట, తెల్లబడుట మరియు చల్లబరచుటయే కాక తరచుగా వచ్చే తలనొప్పులను నివారించుటలో సహాయపడును.
★ నల్లని ఒత్తైన శిరోజాల ఎదుగుదనంతో ...
★ ఆనందమయ జీవనాన్ని ఆస్వాదించగలరు.




కేశోవిన్ తోడుంటే - ప్రతి హృదయం నిశ్చింతే ...




DAN-F Oil
చుండ్రు సమస్య నివారణలో సత్వర ఫలితమివ్వడమే కాక తలమీద పుండ్లను మాన్పివేయును.
ఏ దుష్ఫలితాలను కలిగించదు



KESHOVIN-A Oil
పేను కొరుకుడు సమస్యను అరికట్టును.



KESHOVIN-L Oil
పేల నివారణకు క్షేమమైన. దుర్గుణాలు లేని దివ్యమైన ఆయుర్వేద తైలం

వివరాలకు సంప్రదించండి : 93978 12315, 0866-5532116
Dr. Rao's Herbal Pharma Pvt. Ltd.

Chairman: Brihatrayeeratna,
Dr. NAMBURI HANUMANTHA RAO, L.I.M.
Specialist for all chronic diseases, Hanumanpet, VJA-3. Ph: 0866-2576004.

Technical Director : Dr. N.B. VENU GOPALA RAO M.D., Ayurveda,
Speciality in Diabetic Foot Ulcer, CHYAVANA AYURVEDIC CENTRE,
Dornakal Road, VIJAYAWADA-2. Cell : 9392113356.

గింది. త్వరగా చెప్పరా పుల్లిగా.'' అన్నాడు.

రాబర్టు వులిక్కిపడి తన పేరు రాబర్టనీ పుల్లి గారు కాదనీ సవినయంగా విన్నవించుకున్నాడు. శాస్త్రిగారు ఆప్యాయంగా నవ్వి

''పుల్లాబొట్లు నా సుపుత్రుడు ముద్దుగా పుల్లిగా అని పిలుస్తాను. నిన్ను చూసి పుత్రవాత్సల్యం పెల్లుబికి అలా పిలిచానంతే. పైగా పిచ్చి కన్నా. కింద ఏ కష్టాలు పడుతున్నాడో ఏమో. కళ్ళు మూసుకుని హైద్రాబాదులో ఏ రోడుమీద నడిచినా ఆ కళ్ళు మళ్ళీ తెరవకుండా ఇక్కడ కొచ్చి నరక సౌఖ్యం పొందేవాడే.''

రాబర్టుకు శాస్త్రిగారిని చూసి అనుమానం వచ్చింది. పిచ్చిగాని ఎక్కిందా. తను వచ్చింది చాలక కొడుకు రావాలని కోరుకుంటున్నాడు. కోరి కోరి వాణ్ణి ఈ నరకానికి రమ్మంటున్నాడు. అతను ఆలోచనల్లో వుండగానే శాస్త్రిగారు తడిమాడు. నాన్నుడు వ్యవహారం తనకు సుతరామూ ఇష్టంలేదన్నాడు. రాబర్టు గునిశాడు. నరకంలో శిక్షలిలా వుంటాయని తెలిస్తే తను చచ్చినా చావక పోయుండేవాడినన్నాడు. చావు రాకుండా మందు కనిపెట్టి వుండే వాళ్ళం అన్నాడు.

శాస్త్రి గారికి తిక్క రేగింది. ''వేప కాయలక్కూడా మొహం వాచిన వెధవాయిల్లారా. చావుకు విరుగుడు కనిబెడతారేం. మీ గోరీ కట్టా.

త్వరగా తేల్చు. రిజిష్టరులో పేరెక్కించి అడ్మిషను చేసుకునేది నేనే. రిజిష్టరు క్లోజు చేయాలి'' శాస్త్రిగారు అనునయంగా అన్నారు.

రాబర్ట్ ఎటూ తేల్చుకోలేకపోతున్నాడు. సంశయాత్మక చిత్తంతో

''శాస్త్రి గారూ! మీరు ఈ శిక్షల నుభవిస్తూనే ఉన్నారా? మీ శరీరం ఉక్కులాగుంది.''

శాస్త్రిగారు అటూ ఇటూ ఎవరైనా విదేశీ గుఢచారులున్నారేమోనని చూసి, '' ఇలా రారా అమెరికన్ వాడా ''దగ్గరగా పిలిచి వాత్సల్యంగా భుజం మీద చేయి వేశాడు.. ''నీకో రహస్యం చెబుతా విను. మేం చాలా మంచోళ్ళం. మా నరకంలో చేరిపో. మా దేశంలో 25 యేండ్ల క్రితం వ్యాపారం చేసుక బతకరా వాజమ్మా అని ఇంగ్లీషు వాడికి ఆశ్రయమిచ్చాం. పైపెచ్చు ప్రస్తుతం మా వాళ్ళు మీ దేశంలో చాలా మంది ఉన్నారు. అదిగో ఆ ప్రేమతో చెబుతున్నా. మా నరకంలో చేరిపో'' వేగిర పెట్టాడు.

''మరి శిక్షలు...'' గనిశాడు రాబర్ట్.

''నీ బొంద శిక్ష నరకంలో కూడా నేనింత ఆరోగ్యంగా వున్నానంటే ఫలానా సబ్బుతో స్నానం చేస్తున్నాననుకున్నావా?''

''అలా కాదులెండి. నాకు శిక్షల వివరమే కంపరం రేకెత్తిస్తోంది'' రాబర్టు భాష అతనికి తెలీకుండానే బాగుపడ్డది. ఆశ్చర్యంతో ఆ మాటే పైకన్నాడు. శాస్త్రి అందుకున్నాడు. ''ఆమాట నిజమే నోయి మన ప్రమేయం లేకుండా భాష మారిపోతుంది.

నేనిక్కడకు రాకముందు వీర మాండలికం మాట్లాడే వాడినని, రాసే వాడినని, చాలా మంది అర్థం కావట్లేదని, మొత్తుకునేవారు. అలాంటి వాళ్ళని ఛడా మడా వీర మాండలికంలో తిట్టే వాణ్ణి. అదంతా గతం.''

''శిక్ష విషయం'' మళ్ళీ ప్రస్తుతానికొచ్చాడు రాబర్ట్.''

''మరేం ఫర్లేదోయి. మా దేశంలో కరెంటు మీటరు నడవకుండా రక రకాల జిత్తులు చేసే వాళ్ళం. అయినా భారత దేశానికి చెందిన ఈ నరకంలో కరెంటు ఎప్పుడూ వుండదు. ఆ కరెంటు కుర్చీలో కూచుని నువ్వు మారాజులా పేపరే చదువుకుంటావో, నవలే చదువుకుంటావో నీ ఇష్టం. నీకు ఈషణ్మాత్రం హాని జరగదని హామీ ఇస్తున్నా.

''మరి మేకుల పడక'' రాబర్టు భయం పూర్తిగా పోలేదు.

''హోరి నీ ఇల్లు బంగారంకానూ. ఆ మేకుల సప్లయి కాంట్రాక్టు ఒకడికిచ్చాం. బయానా ఎత్తుకుని పోయినవాడు అదే పోత. వాడు మేకులు తేడు, మంచాలకు కొట్టరు. మరో మన్వంతరందాకా వాడు రాడని నా ప్రగాఢ విశ్వాసం. ఒక వేళ వచ్చినా తెచ్చినా చచ్చు పుచ్చువి తెస్తాడు. మనకవి గుచ్చుకోవు. ఇప్పట్లో మళ్ళీ టెండర్లు పిలవరు. పిలుస్తే నీ చేతే వేయిస్తా. ఎంతైనా విదేశీయుడివి కదా. ఆ కాంట్రాక్టు నీకు ఇస్తారు. ఢంకా బజాయించి మరీ చెబుతా.''

రాబర్టు గుండెలు మామూలు స్థితిలోకొచ్చే క్రమంలో వున్నాయి.

''మరి భూతం- కొరడా లేక కొరడా భూతం సంగతో?''

''మళ్ళీ హోరి పిచ్చివాడా. ఈ భూతం పోస్టుకు నోటిఫికేషనిచ్చాం. మా దేశంలో ప్రభుత్వ వుద్యోగం చేసి, చచ్చి ఇక్కడికి వచ్చినవాడినని సెలెక్టు చేశారు. వాడికి నిద్రా, ఆకలి ఎక్కువ. పైగా బద్ధకం. దానికి తోడు బల్లకింది వ్యవహారాలంటే మోజు. ప్రతిరోజు వాడికి మా ఆహారం నుంచి కొంత త్యాగం చేస్తాము. వాడు మమ్మల్ని కొట్టినట్లు రిజిష్టరులో వ్రాసుకొని, తిని, నిద్రపోయి లేచి కొరడా చంకన పెట్టుకుని అలిసిపోయినవాడి మొఖం పెట్టి వెళ్ళిపోతాడు. ఇప్పుడు చెప్పు.''

రాబర్ట్ మరో ఆలోచన లేకుండా భారతీయ నరకంలో చేరిపోయాడు.

